క్లుప్తంగా

వైభవంగా సీతారామస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా శుక్రవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తకంగా నిర్వహించారు. జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, మాంగల్య ధారణ మహోత్సవం వంటి ఘట్టాలు కనుల పండుగగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు హాకీ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాలికల జూనియర్స్ విభాగంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ హాకీ పోటీల్లో ఎంపికైన జట్టు పాల్గొంటుందన్నారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 8 గంటలకు డీఎస్ఏ ప్రాంగణంలోని హాకీ మైదానంలో రిపోర్టు చేయాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌కు ఆర్‌వో ప్లాంట్ వితరణ



డాక్టర్ లావణ్యకుమారికి ఆర్‌వో ప్లాంట్ పత్రాలను అందజేస్తున్న సంస్థ మేనేజర్ సుధాకర్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌కు దివీస్ లేబరేటరీస్ తొండంగి శాఖ ప్రతినిధులు శుక్రవారం ఆర్‌వో ప్లాంట్ అందజేశారు. 250 ఎల్‌పీహెచ్ సామర్థ్యం ఉన్న ఈ ఆర్‌వో ప్లాంట్‌ను స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో అమర్చారు. ఈ నేపథ్యంలో సంస్థ మేనేజర్ సుధాకర్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సత్కరించి, వాటర్ ప్లాంట్ సేవలు ప్రారంభించారు.

రామలింగేశ్వరునికి రెట్టింపు ఆదాయం

పిఠాపురం: గొల్లప్రోలులోని రామలింగేశ్వర దేవస్థానం భూముల వేలంలో రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. దేవస్థానానికి చెందిన సర్వే నంబరు 41లోని 10.90 ఎకరాల భూమిని ఏడాది కాల పరిమితికి ఆలయంలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో 18 మంది పాల్గొనగా సిద్దా వీరబాబు రూ.3.22 లక్షలకు ఏడాది శిస్తు చెల్లించేలా పాడుకున్నారు. గత ఏడాది శిస్తు రూ.1.72 ఉండగా ఈ ఏడాది రెట్టింపు రావడంతో రికార్డు స్థాయిలో ఆలయానికి ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు అశ్విని, ఆలయ చైర్మన్ గొల్లపల్లి పెద్ద బాబి తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి కల్యాణం తగునా!

- పంచాయతీల్లో కానరాని వివాహ నమోదు
- కార్యదర్శులకు, ప్రజలకు కొరవడిన అవగాహన
- చట్టం అమలైతేనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట



కాకినాడ సిటీ: అడుగుడుగునా నిర్లక్ష్యం.. అంతులేని జాప్యంతో చట్టం తన పని తాను చేయడం లేదు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని చట్టం చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామ పంచాయతీల్లో వివాహ నమోదు తప్పనిసరని ప్రభుత్వం చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో గ్రామాల్లో అవగాహన లోపంతో నేటికీ అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వివాహ నమోదు తప్పనిసరి చేయాలని 2002వ సంవత్సరంలో చట్టం చేశారు. జీవో 193 ప్రకారం ప్రతి గ్రామంలో వివాహాల నమోదును కార్యదర్శులు నమోదు చేయాలని చట్టం రూపొందించారు. వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కుల, మతాల ప్రాతిపదికన కొన్ని మినహాయింపులు ఉండగా క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంతో అన్ని మతాల వారికి రిజిస్ట్రేషన్ చట్టం వర్తించేలా రూపొందించారు.

అవగాహన లోపం

వివాహ రిజిస్ట్రేషన్ నమోదుపై కార్యదర్శులకు అంతగా అవగాహన లేక పోవడంతో గ్రామాల్లో ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యారని చెప్పవచ్చు. కేవలం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు తప్ప వీటిపై అవగాహన అంతగా లేదంటున్నారు. ఆడ పిల్లకు 18, మగ పిల్లలకు 21 ఏళ్ల వివాహ వయసుగా నిర్ణయిస్తూ గ్రామాల్లోని ప్రజలకు తప్పనిసరిగా అవగాహన కల్పించాల్సి ఉంది.

పంచాయతీల్లో నమోదు

వివాహం జరిగిన పంచాయతీల్లోనే కార్యదర్శులకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. జనన, మరణ ధ్రువపత్రాల మాదిరిగానే వివాహ రిజిస్ట్రేషన్ నమోదు పత్రాలు పొందవచ్చు. వివాహం జరిగిన 30 రోజుల తర్వాత కూడా రోజుకు వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జరుగుతున్న బాల్య వివాహాలు

కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని మూడు మండలాల్లో అక్కడక్కడా బాల్య వివాహాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. ఆర్థిక సమస్యలు, అవగాహన లోపంతో గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ప్రజల్లో పూర్తిగా చైతన్యం లోపించింది. ఎంతో భవిష్యత్ ఉన్న జీవితాలు బాల్య వివాహాలతో చీకటిమయమవుతున్నాయి. బాల్య వివాహాలను గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీలు అడ్డుకుంటున్నా ఇంకా అక్కడక్కడ అదే పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని అధికారులు

వివాహం చేసుకునే ముందు వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధనలను అధికారులు అమలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేస్తే తప్ప ఐసీడీఎస్ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వీటిపై పంచాయతీ సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా అవగాహన కల్పించి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

అవగాహన కల్పించాలి



బాల్య వివాహాలపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో కాలేజీల్లో, తల్లిదండ్రులకు ఇలా ప్రతి ఒక్కరికీ బాల్య వివాహాలపై అవగాహన తప్పనిసరి. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతో పదో తరగతి పాసైన వెంటనే బాల్య వివాహాలు చేస్తున్నారు. వివాహాలు చేసే వారు తప్పనిసరిగా పంచాయతీల్లో నమోదు చేయాలని నిబంధనలు కఠినతరం చేస్తే బాల్య వివాహాలు అరికట్టవచ్చు.

– కర్రి గంగాచలం, మత్స్యకార సంఘ నాయకులు, తూరంగి

ఘనంగా వాత్సల్యానంద ఆరాధన



సమావేశంలో మాట్లాడుతున్న సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు

బోట్‌క్లబ్: వేదాంతం సంగమేశ్వర శాస్త్రి సన్యాసం స్వీకరించి వాత్సల్యానంద భారతిగా మారి కొన ఊపిరి ఉన్నంత వరకూ దేశం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారని వాత్సల్యభారతి సంఘటన కార్యదర్శి మద్దాలి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లక్ష్మీగణపతి ఆలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాత్సల్యానంద భారతి స్వామి పుణ్యతిథి సందర్భంగా ఆరాధన చేశారు. సంస్థ కార్యదర్శి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ వాత్సల్యానంద భారతి స్వామి స్ఫూర్తిదాయకంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. స్వామిజీని ఆదర్శంగా తీసుకుని హైదరాబాద్, రాజమహేంద్రవరం, అమలాపురంలో పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపకుడు గొట్టుముక్కల వెంకట సత్యనరసింహాశాస్త్రి మాట్లాడుతూ పురాణ పఠనం వల్ల బహుముఖ ప్రజ్ఞాశాలి అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నందూరి కృష్ణమూర్తి, ఆకొండి శ్రీనివాస రాజారావు, దివి శ్రీనివాస్, నెమలికంటి రవి, పట్టాబి, వాసంశెట్టి బాబు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ సిటీ: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యూనియన్ పతాకాన్ని జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి చేశారు. తొలుత యూనియన్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జీ పతాకావిష్కరణ చేశారు. అనంతర వారు మాట్లాడుతూ కార్మిక సంఘాలు, కార్మికుల మధ్య ఐక్యత కోసం, వారి హక్కుల కోసం పోరాడుతున్న సంస్థ సీఐటీయూ అని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు చట్టాలను కాలరాసేలా 44 కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌ల కిందకు తీసుకురావాలని చూస్తున్నారన్నారు. దీనిని ఎంత మాత్రం కార్మికవర్గం సహించదన్నారు. ఆ కోడ్‌ల రద్దు, కనీస వేతనాలు అమలుకు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, స్కీం వర్కర్లందర్నీ నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించడం తదితర డిమాండ్లపై జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లేని పక్షంలో కార్మిక వర్గ ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు, సీహెచ్ పద్మ, నగర నాయకులు పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ శుక్రవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లో వివిధ రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మజ్జి అప్పల నాయుడును స్టేషన్ నిర్వహణపై అభినందించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం పెంపొందేలా మొక్కలు పెంచాలని సూచించారు.

మాపై ప్రభుత్వం చిన్నచూపు



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వం తమపై చిన్నచూపు చూస్తోందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తుల శివ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన సమ్మె శుక్రవారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 24 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కింది స్థాయి అధికారులు నామమాత్రపు చర్చలకు పిలిచినప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణం వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ విభాగం పనులు నిలుపు చేసి, నీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కాకినాడ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీధర్, అధ్యక్షుడు ఏకల శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రామం

కాకినాడ రూరల్: వివిధ కోర్టు కేసులకు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభిస్తున్నందున జూలైలో జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. బోటుక్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలతో కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగి విలువైన సమయాన్ని, ధనాన్ని కక్షిదారులు వెచ్చిస్తున్నారన్నారు. ఇరు పార్టీలను నొప్పించకుండా వెలువరించే ఒక మహత్తరమైన ప్రక్రియ లోక్ అదాలత్ అని ఆయన తెలిపారు. వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, కోశాధికారి పీవీ రాఘవరావు, సూర్యనారాయణ, బి.సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



నినాదాలు చేస్తున్న కార్మికులు

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమ్మె శుక్రవారంతో 24వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో మున్సిపల్ కార్యాలయం ఎదుటనే సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్ల సంఘం అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం 'చలో రామచంద్రపురం' పిలుపు ఇచ్చామని, అయితే మంత్రి అందుబాటులో లేరని తెలిసి వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రభుత్వంతో చర్చలు జరిగే అవకాశం ఉన్నదని, చర్చలు విఫలమైతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాపవరపు నూకరాజు, పులపకూర రామకృష్ణ, మేడిబోయిన వెంకన్న, నక్క రత్నం రాజు పాల్గొన్నారు.

తీరంలో అల కల్లోలం

- అల్పపీడనంతో వణుకుతున్న తీరం
- తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు



చిన్న వంతెన వద్ద అలల ఉధృతి



ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో ఎగసిపడుతున్న అలలు

కొత్తపల్లి: అల్పపీడనంతో తీరంలో సముద్ర అలలు విరుచుకుపడుతుండడంతో తీరంలో కల్లోలం నెలకొంది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఉప్పాడ, కోనపాపపేట తీరప్రాంతాల్లో ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయి. తీర ప్రాంతానికి రక్షణగా ఉన్న గోడ రాళ్లు సైతం అలల తాకిడికి గ్రామంలోకి వచ్చి పడ్డాయి. కెరటాల తాకిడికి ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది. ఈ పరిస్థితులతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు.

అధికారులు అప్రమత్తం

అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతంలో ఉన్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని తహసీల్దారు చిన్నారావు అన్నారు. కార్యాలయంలో తుపాను హెచ్చరికలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పాడ నుంచి కోనపాపపేట వరకూ ఉన్న తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేకాధికారులతో బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముఖ్యంగా తుపాన్ షెల్టర్లను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరం అయితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

ఉద్యానోద్ధారిణి దశపర్ణి

- ఈ కషాయం తెగుళ్ల నివారణలో మేటి
- గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ శిక్షణ కేంద్రంలో తయారీ
- దుర్గాడలో అధిక మొత్తంలో ఉత్పత్తి



దశపర్ణి కషాయం తయారీకి ఆకులు సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



దశపర్ణి కషాయం తయారీకి ఇతర పదార్థాలను సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



దశపర్ణి కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పిఠాపురం: ప్రకృతి వ్యవసాయానికి పెట్టింది పేరైన గొల్లప్రోలు మండలం దుర్గాడలో వివిధ రకాల కషాయాల తయారీని ముమ్మరం చేశారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తుండడంతో ఎక్కువ మొత్తంలో కషాయాల తయారీ చేపట్టారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజర్ ఆధ్వర్యంలో దుర్గాడ గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ, శిక్షణ కేంద్రంలో ప్రత్యేక కషాయాల తయారీ చేపట్టారు. వివిధ రకాల పంటలకు వీటిని పిచికారీ చేయడానికి కషాయాలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం 400 లీటర్ల దశపర్ణి కషాయాన్ని తయారీ ప్రారంభించారు. పది రకాల ఆకులతో ఈ కషాయం తయారు చేయడానికి సుమారు 40 రోజులు పడుతుందని దుర్గాడ గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు గండ్ర శివ చక్రం తెలిపారు.

తయారీ ఇలా..

సుమారు 200 లీటర్ల సామర్థ్యం గల డ్రమ్ములో 150 లీటర్ల నీటిని వేస్తారు. 10 గ్రాముల ఇంగువ, 20 కేజీల దేశీ తాజా ఆవుపేడ, 20 లీటర్ల ఆవు మూత్రం మొదటి రోజు వేస్తారు. 24 గంటల అనంతరం 2 కేజీల అల్లం, 2 కేజీల పచ్చిమిర్చి, 2 కేజీల వెల్లుల్లి, 2 కేజీల పొగాకు, అర కేజీ పసుపు వేసి ఊరబెట్టాలి. మూడో రోజు 5 కేజీల వేపాకులు, 2 కేజీల చొప్పున గానుగ ఆకులు, సీతాఫలం ఆకులు, ఆముదం ఆకులు, ఉమ్మెత్త, వావిలాకు, బొప్పాయి, చేమ, తూటికాడ, జిల్లేడు వంటి పది రకాల ఆకులు వేస్తారు. ఈ మిశ్రమాన్ని ప్రతి రోజు ఉదయం సాయంత్రం కలుపుతుండాలి. 40 రోజుల తరువాత ఈ మిశ్రమాన్ని వడకడితే 200 లీటర్ల డ్రమ్ముకు సుమారు 150 లీటర్ల కషాయం తయారవుతుంది.

తెగుళ్ల పురుగుల నివారణకు

ఈ కషాయం అన్ని రకాల పంటలకు వ్యాపించే తెగుళ్లు, పురుగుల నివారణకు అద్భుతంగా పని చేస్తుందని శివచక్రం తెలిపారు. గత ఐదేళ్లుగా దీనిని తయారు చేసి రైతులకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది లీటరు రూ.40కు విక్రయిస్తున్నామని ఎకరానికి సుమారు 3 లీటర్ల నుంచి 5 లీటర్లు పిచికారీ చేస్తే ఏ విధమైన తెగులు పురుగులు ఆశించవన్నారు. కేవలం రూ.200 ఖర్చుతో రైతులు తమ పంటలను కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ తయారు చేసిన కషాయాలు ఇతర జిల్లాలకు చెందిన రైతులు వచ్చి తీసుకువెళ్తున్నారని ఆయన తెలిపారు. ఈ కషాయం పిచికారీ చేసిన పంటలు చాలా ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. వీటి పిచికారీ వలన భూమి కూడా తెగుళ్లను తట్టుకునే శక్తిని పెంచుకుంటుందన్నారు. ప్రస్తుతం పకృతి వ్యవసాయంలో ఈ కషాయం మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. అందుకే దీనిని పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న ఖరీఫ్‌కు ఎక్కువ మొత్తంలో దీనిని సిద్ధం చేస్తున్నామన్నారు. అన్నీ ప్రకృతిలో లభించే ఆకులు అలములే కాబట్టి దీని తయారీకి పెద్దగా ఖర్చు కూడా ఉండదన్నారు.

కషాయాలదే ప్రధాన పాత్ర



ప్రకృతి వ్యవసాయంలో అత్యంత ప్రాధాన్యం కషాయలకే ఉంటుంది. ఎటువంటి రసాయనాలు లేకుండా కేవలం ప్రకృతిలో లభించే ఆకులు, దేశీయ ఆవు మూత్రం, పేడలతో కషాయాలు తయారు చేస్తున్నాము. వీటి వల్ల వ్యవసాయంలో పంటలకు ఎంతో మేలు జరుగుతోంది. తక్కువ పెట్టుబడితో అందరు తమ ఇళ్ల వద్దే తయారు చేసుకునే వీలు వీటికి ఉంది. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఎక్కువ మొత్తంలో కషాయాలు తయారు చేసి ఇతర ప్రాంతాల రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాము. ప్రస్తుతం ఈ కషాయలకు మంచి డిమాండ్ ఉంది. రసాయన ఎరువులు పురుగు మందుల వల్ల పంట భూములు తన స్వభావాన్ని, శక్తిని కోల్పోయి నిస్సత్తువగా మారడం వల్ల పంటలకు ఎక్కువగా పురుగులు, తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటిని అరికట్టాలన్నా భూమిని సారవంతం చేయాలన్నా ఒక్క ప్రకృతి వ్యవసాయానికే సాధ్యమవుతుంది. అందుకే ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా రైతులను చైతన్యవంతులను చేసి అవగాహన పెంచుతున్నాం. రైతులు కూడా ముందుకు వస్తున్నారు.

– ఎలియాజరు, ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం, కాకినాడ

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిఠాపురం.. మాకొద్దు బాబోయ్!

- మున్సిపాలిటీ నుంచి బదిలీలకు భారీగా దరఖాస్తులు
- ఇప్పటికే ఖాళీ అయిన కీలక పోస్టులు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం అంటే అధికారులు హడలెత్తిపోతున్నారు. ఇక్కడ ఉండలేం.. మమ్మల్ని బదిలీ చేయండంటూ ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నారు. ఒక్క పిఠాపురం మున్సిపాలిటీ నుంచే ఎక్కువ మంది బదిలీలకు దరఖాస్తులు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పిఠాపురం మున్సిపాలిటీలో డీఈ లాంగ్ లీవ్‌లో ఉన్నారు. ఆర్‌ఓ, ఆర్ఐ, ముగ్గురు ఏఈలు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఎఫ్1, మేనేజర్, రికార్డు అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పారిశుధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, కార్యాలయ సిబ్బందిలో 90 శాతం మంది తమను బదిలీ చేయాలంటూ దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. పిఠాపురంలో కూటమి నేతల పెత్తనం ఎక్కువైపోవడం, ప్రతి ఒక్కరూ నాయకుడినంటూ అధికారులపై జులుం ప్రదర్శించడం వంటి కారణాలతో ఇక్కడ పని చేయలేకపోతున్నామని వాపోతున్నారు. పని చేయాలని ఒకరు.. వద్దని మరొకరు ఒత్తిడి తెస్తుండటంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా జనసేన నేతల తీరుతో తాము నిత్యం నరకం చవి చూస్తున్నామని పలువురు సిబ్బంది తోటి వారి వద్ద వాపోతున్నట్లు సమాచారం. ఇదే బాటలో వార్డు సచివాలయాల సిబ్బంది కూడా ఎప్పుడు బదిలీ చేస్తే అప్పుడు వెళ్లిపోవాలని చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పిఠాపురం మున్సిపాలిటీ చరిత్రలో ఎక్కువ మంది బదిలీలకు దరఖాస్తులు చేయడం ఇదే తొలిసారని చెబుతున్నారు. ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన వారు ఇద్దరే ఉండగా మిగిలిన వారందరూ ఐదేళ్లు పూర్తి కాకపోయినా తమను బదిలీ తప్పనిసరిగా చేయాలని కోరుకోవడం గమనార్హం.



బహిరంగ ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ అశోక్ నగర్ కాపురస్తులు ముసిరాజీ ప్రకాశం గారి కుమారుడు సాంబమూర్తి గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నా క్లయింటు కాకినాడ జిల్లా ఇ.అచ్యుతాపురం గ్రామ కాపురస్తులు వంగల శ్రీ వీరవెంకట సత్యశ్రీనివాస S/o.v.v.సత్యనారాయణ గారి వద్ద నుండి షెడ్యూలు దాఖలా ఆస్తి ది.21-01-2012 వ తేదీన కొనుగోలు చేసియున్నారు. సదరు కొనుగోలు సమయములో సత్యశ్రీనివాస గారు తన యొక్క ఒరిజినలు దస్తావేజు నెం.6028/1998 SRO కాకినాడ తేది.22-12-1998న పోయినదని ఎంత వెతికినను దొరకలేదని తాను సదరు దస్తావేజును దుర్వినియోగం చేయలేదని మా క్లయింటును నమ్మించి క్రయము జరిపియున్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనను ఎటువంటి క్రయములు వగైరాలు వున్న యెడల ఈ దిగువ ఎడ్రస్సు వారికి వ్రాతపూర్వకముగా సాక్ష్యాధారములతో తెలుపుకొనగలరు. ఈ ప్రకటన వెలువడిన 7 దినములలో తెలుపుకొనగలరు. లేని యెడల సదరు ఆస్తిపై ఎటువంటి అభ్యంతరము క్రయములు లేని ఆస్తిగా పరిగణించి బదలాయింపు గ్రహించగలరు.

షెడ్యూల్: కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, ఇ.అచ్యుతాపురం గ్రామం, మధురా నగర్ ఏరియా సర్వే నెం. 176/1 & 176/2 లో గల డోర్.నెం.4-40 గల RCC దాబాయిల్లు పూరా 1132 చ.గజములలో 181 చ.గజముల స్థలం ఈ దిగువ హద్దులు మధ్యస్థమైన. **తూర్పు:** డోర్.నెం.4-41 వంగల మురళీ మోహన గారి ఇల్లు 57 అంగుళం; **పడమర:** మల్లిడి రామకృష్ణ రెడ్డి గారి ఆస్తి కొంత మేర కర్రి రాజేశ్వరి గారి ఆస్తి కొంత మేర 53-6 అంగుళం; **ఉత్తరం:** కర్రి రాజేశ్వరి గారి ఆస్తి 29-6 అంగుళం; **దక్షిణం:** 25 అడుగుల వెడల్పు రోడ్డు 29-6 అంగుళం

కాకినాడ, ది.30-05-2025 — కె.వి.వి.చలపతి, MA, BL, DPM, అడ్వకేట్, కాకినాడ. సెల్: 9848260426